క్లుప్తంగా

కిచెన్‌ను పరిశీలించిన రిమ్స్ డైరెక్టర్


ఉల్లిగడ్డలను పరిశీలిస్తున్న రిమ్స్ డైరెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు భోజనాన్ని సరఫరా చేసే వంటశాలలో కుళ్లిపోయిన ఉల్లిగడ్డలు వాడుతున్నారని 'ఉల్లి కంపు' శీర్షికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ వంటశాలను ఆకస్మికంగా సందర్శించారు. కంపుకొడుతున్న ఉల్లిగడ్డలను పరిశీలించి, నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృత్తమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

తాంసి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని బండల్ నాగపూర్‌లోని ఈదుల్ సావర్గాం మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ చదువులో రాణించాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, ఉపాధ్యాయులు శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మాలీ సంఘం జెండా ఆవిష్కరణ

తలమడుగు: మండలంలోని బరంపూర్ బస్టాండ్ వద్ద మాలీ సంఘం జెండా పండుగను మాలీ (బారె) కులస్తులు, గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బెల్లపు వినోద్, బెల్లపు విలాస్, మొహర్లే భీమ్రావు, బెల్లపు మారుతి,మాలీ కులస్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

తలమడుగు: రైతులు, పశుపోషకులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి లావణ్య అన్నా రు. గురువారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అన్ని గ్రామాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఆశన్న, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

బోథ్: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని సొనాల మండలంలోని వివేకానంద పాఠశాలలో గురువారం ×ఫుడ్ ఫెస్టివల్‌÷ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి కుటుంబసభ్యుల సహకారంతో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారుచేసుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో అమ్మకానికి ఉంచారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పోషకులు ఈ స్టాల్స్‌ను సందర్శించి ఉత్సాహంగా ఆహార పదార్థాలను కొనుగోలు చేసి రుచి చూశారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కుంట నవీన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన విద్యార్థులు తయారుచేసిన స్టాల్స్‌ను ప్రత్యేకంగా పరిశీలించి, ఆహార పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, ఓరుగంటి ఇస్తారి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు కేంద్రానికి చెప్పాలి

కైలాస్‌నగర్: కేంద్రం చెప్పిన మాటలను మాకు చెప్పడం కాదు.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రానికి చెప్పండంటూ.. తాంసి మండలం వడ్డాడి గ్రామానికి చెందిన కేమ రామయ్య అనే రైతు తన ఆవేదనను వెలిబుచ్చారు. పత్తి కొనుగోళ్ల సన్నాహక సమావేశంలో మాట్లాడిన ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులేవరు రైతుల క్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల ధరలు పెరుగుతుంటే మద్దతు ధర మాత్రం తగ్గుతుందన్నారు. తేమ పేరిట కిరికిరి చేస్తు ఈ ధరను కూడా రైతుకు ఇవ్వడం లేదని దీంతో వ్యవసాయం చేయడమే దండగ అనే పరిస్థితి రైతుకు ఏర్పడిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లాకు సంబంధించిన స్థితిగతులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఇక్కడి రైతులకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

జాడలేని కొనుగోలు కేంద్రాలు

- పూర్తిస్థాయిలో చేతికివచ్చిన మొక్కజొన్న
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- దళారులకు అమ్మి నష్టపోతున్న రైతులు


మార్కెట్‌యార్డులో ఆరబెట్టిన మొక్కజొన్న

ఇంద్రవెల్లి: వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న చేతికి రావడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. పూర్తిస్థాయిలో పంట చేతికివచ్చినా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో తక్కువ ధరకే దళారులకు పంట అమ్మి ఆర్థికంగా నష్టపోతున్నారు.

మద్దతు ధర కరువు..

ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 1200 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్న క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం పూర్తిస్థాయిలో పంట చేతికివచ్చిన కొనుగోలు కేంద్రాలు జాడలేదు. ఆరుగాలంకష్టపడి పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరతో అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేవు.

దళారులదే ఇష్టారాజ్యం..

మొక్కజొన్న కొనుగోలు విషయంలో దళారులదే ఇష్టారాజ్యం నడుస్తోంది. తాము ప్రకటించిన ధరతోనే రైతుల నుంచి పంట కొనుగోలు చేయడంతో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈసారి మొక్కజొన్న పంటకు రూ. 2400 ప్రకటించగా.. దళారులు కేవలం రూ. 1800 నుంచి 1900లకే కొనుగోలు చేస్తున్నారు. తూకంలో సైతం కోతలు విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రం ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం సాగు చేసిన మొక్కజొన్న పంట పూర్తిస్థాయిలో చేతికివచ్చింది. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరతో దళారులకు అమ్మల్సివస్తోంది. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– ఆత్రం జల్పత్‌రావ్, తుమ్మగూడ

తక్కువ ధరకు కొనుగోళ్లు



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారస్తులకు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. క్వింటాల్‌కు రూ. 1800 నుంచి రూ. 1900లకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. పంటలకు ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలి.

– మడావి గజానంద్, చింతకర

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న 'కంది'

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజాసేవభవన్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు తన్నీరు నవత, వడ్డెర సంఘం అధ్యక్షుడు గొడ్డండ్ల శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

కైలాస్‌నగర్: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీఏఎస్ సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశ్వర్

ఆదిలాబాద్‌రూరల్: బెస్ట్ అవలెబుల్ (బీఏఎస్) సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బెస్ట్ అవలెబుల్ స్కూళ్లను గురువారం పరిశీలించారు. విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. విద్యార్థుల చదువులను ఆపవద్దని సూచించారు. బెస్ట్ అవలెబుల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. ఆయన వెంట దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీత, ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య ఉన్నారు.

ఒకే రోజు ఇద్దరు మహిళల మృతి

- వడగామ్ గ్రామంలో విషాదం

ఇంద్రవెల్లి: ఒకే రోజు ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని వడగామ్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఆత్రం లచ్చుబాయి(60) ఇంటి పనులు చేస్తూ అకస్మికంగా స్పృహ కోల్పోయి అక్కడికక్కడే మృతి చెందింది. ఆదే గ్రామానికి చెందిన సిడాం జారుబాయి (25) వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతుంది. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించగా.. ఆరోగ్యం కొంత కుదుటపడింది. గురువారం ఉదయం చేతి పంపు నుంచి నీటిని తీసుకోస్తుండగా.. కడుపులో మంట ఉందని కళ్లు తిరిగి కింద పడింది. ఆటోలో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఇద్దరు మహిళలు ఒకే సమయంలో మృతి చెందడంతో వడగామ్ గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


తాంసి: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి


భీంపూర్: మాట్లాడుతున్న డాక్టర్ నిఖిల్‌రాజ్

భీంపూర్: పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అనంతరం అప్పుడే పుట్టిన బిడ్డలకు టీకాలు వేశారు. మండల విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, నర్సింగ్ ఆఫీసర్ పూర్ణిమ, పర్యవేక్షకులు మేఘ, రోహిదాస్, లచ్చుబాయ్, విష్ణుకుమార్, శంకర్, రేఖ, అశోక్, రాందాస్ పాల్గొన్నారు.

తాంసి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ప్రతీ రోజు పోషకాహారం తీసుకోవాలని తాంసి వైద్యాధికారి శ్రావ్యవాణి అన్నారు. గురువారం బండల్‌నాగాపూర్ రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసంలో భాగంగా పోషణఅభియాన్ నిర్వహించారు. బాలింతలకు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ తులసీరాం, అంగన్‌వాడీలు భాగీర్థ, సరిత, విజయలక్ష్మి, నర్సమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫర్హా అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడంతో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.

తలమడుగు: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోషణ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమలో మండల వైద్యాధికారి హరీశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణ, మంజుల, పద్మ పాల్గొన్నారు.

108లో ప్రసవం

భీంపూర్: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బందికి గురువారం సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే బిడ్డకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ దత్తు తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని ఆస్పత్రిలో చేర్పినట్లు పైలట్ సత్యనారాయణ పేర్కొన్నారు.


స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

జైనథ్: మహారాష్ట్ర నుంచి బహదూర్, కూర, కాప్రి గ్రామాల మీదుగా వేలాది వాహనాలు వెళ్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం గ్రామాల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడం లేదని కూర గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది ప్రజావాణిలో వాహనాల రద్దీ పెరుగుతుందన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

టెట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

బేల: టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, రివ్యూ పిటిషన్ వేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాలంటే టెట్ పరీక్ష తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివన్న, సభ్యులు సంతోష్, అశోక్, నాందేవ్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న లింగాగౌడ్

ఉట్నూర్‌రూరల్: బీసీ రిజర్వేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 18న ఉట్నూర్ డివిజన్ బంద్ నిర్వహించనున్నట్లు బీసీ రిజర్వేషన్ కమిటీ మండల కన్వీనర్ లింగాగౌడ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. తెలంగాణలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలపై అణచివేత మొదలైందన్నారు. వ్యాపారులు, ప్రజలు బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ధరణి రాజేశ్, కేంద్రే రమేశ్, కందుకూరి రమేశ్, కట్టా లక్ష్మణాచారి, బింగి వెంకటేశ్, సత్యం పొన్నం, జగన్, గంట విజయ్, సల్గారే రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

'ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా'


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని ఎవరూ ఆధర్యపడొద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని చెరపల్లి గ్రామానికి చెందిన అనక విలాస్ డయాలసిస్ సమస్యతో అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అసుపత్రిలో చేరగా ఆసుపత్రిని సందర్శించి అనక విలాస్ ఆరోగ్య పరిస్థితి డాక్టర్ క్రాంతిని అడిగి తెలుసుకున్నారు. విలాస్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బీఆర్‌ఎస్ కన్వీనర్ వెంకటేశ్, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర రెడ్డి, రమాకాంత్, రవికాంత్ యాదవ్, తిరుమల గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా దండారీ ఉత్సవాలు


నృత్యం చేస్తున్న గుస్సాడీలు


పూజలు చేస్తున్న ఆదివాసీలు

బోథ్: మండల వ్యాప్తంగా ఆదివాసీ గూడెల్లో దండారీ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండ్లపల్లె, నక్కలవాడ, లక్ష్మీపూర్, కొత్తపల్లె, నాగాపూర్, చింతగూడ, నేరేడుపల్లె, కంటెగాం వంటి గ్రామాల్లో గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. ఆదివాసీలు ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

నేరడిగొండ: ఆదివాసీల సంస్కృతికి దండారీ (గుస్సాడీ) ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని మంగల్‌మోటా గ్రామంలో దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సంస్కృతిని కాపాడుకోవాలంటే ఇలాంటి ఆచారాలను తరతరాలకు అందించాలన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారంపేట, మత్తడిగూడ గ్రామాల్లో దండారీ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పుచప్పుళ్ల మధ్య కోలాటం ఆడుతూ.. వేడుకలు జరుపుతున్నారు. లక్కారంపేట గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల్లో గ్రామస్తులు తెలంగ్‌రావు, శ్యాంరావు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం


ఇచ్చోడ: అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో

ఇచ్చోడ: సీపీఆర్‌పై అవగాహన ఉండాలని సీహెచ్‌వో బ్రహ్మనందం రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు గుండె వేగంగా కొట్టుకొని అగిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యక్తులకు వెంటనే సీపీఆర్ చేస్తే ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంటుదన్నారు. పీహెచ్‌ఎస్ రాజుబాయి, ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని 108 ఈఎంటీలు కుంబోజీ దత్తాత్రేయ, గణేశ్‌లు అన్నారు. బస్సుల్లో ప్రయాణ సమయంలో ఎవరికైనా అత్యవసరం అయితే వెంటనే సీపీఆర్ చేయాలన్నారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. పైలెట్స్ రవీందర్, బస్సీ సుందర్ సింగ్ ఉన్నారు.

సాత్నాల: అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం సంభవించినప్పుడు వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు రక్షించవచ్చని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సుచల అన్నారు. భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామంలో గురువారం ప్రాథమికున్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు సీపీఆర్ పద్ధతిని ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెచ్ఈవో రామ్‌రెడ్డి, చంద్రశేఖర్, అనిత పాల్గొన్నారు.

బేల: ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలని బేల పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రత్యేకాధికారి గేడం నవీన, మెడికల్ సూపర్‌వైజర్‌లు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

'ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం'


పురస్కారాలు పొందిన ఉద్యోగులతో అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్ వర్క్స్ మేనేజర్ ఎస్.ప్రణీత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ డిపోలో గురువారం ఏర్పాటు చేసిన ప్రగతి చక్ర పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులకు అవార్డులు అందించారు. సంస్థ ప్రగతికి ఉద్యోగులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. వారి కృషిని గుర్తిస్తూ ప్రగతి చక్ర పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన


పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

సాత్నాల: మండలంలోని కన్నా మెడిగూడ గ్రామంలోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను గురువారం తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపీడీవో వెంకట్ రాజు పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయి అధికారుల పర్యవేక్షణలో అర్హులుకు అన్నీ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం మెడిగూడ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధన తరగతులను పరిశీలించారు.

పనులు వేగవంతం చేయాలి

తాంసి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తాంసి ఎంపీడీవో మోహన్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని తాంసి, జామిడి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనులపై ఆరా తీశారు. నిర్మాణం పూర్తయిన వెంటనే దశలవారీగా బిల్లులు అందేలా సాఫ్ట్‌వేర్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి విజయ, గంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం..

శ్మశాన వాటికలో మొరం వేయిస్తాం

బోథ్: బోథ్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్మశాన వాటికను గురువారం ఎంపీడీవో రమేశ్, ఈవో అంజయ్యలు సందర్శించారు. పూర్తిగా బురదమయంగా మారడంతో తాత్కాలికంగా చదును చేయించి, వెంటనే మొరం వేయించాలని ఆదేశించారు.

పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన సహకార సంఘం రిటైడ్ సీఈవో భోజన్నను గురువారం ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు. గత నాలుగు రోజుల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ చేసుకున్న భోజన్నతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

బోథ్: మండలానికి చెందిన జుమ్మేరాత్ పోశెట్టి కుటుంబసభ్యులను రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది పంద్రం శంకర్, సంఘం సభ్యులు గురువారం పరామర్శించారు. పోశెట్టి ఇటీవల మహోర్‌లో డ్రైవింగ్ చేస్తుండగా ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులకు రూ. 5000ల ఆర్థిక సాయం అందజేశారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 80 పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రేం కుమార్, అధ్యాపకులు నిఖత్, రాజేశ్వర్, సత్యం, నరేశ్, అఖిలాస్, సురేశ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

నేరడిగొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో నేరడిగొండ మండల బీఆర్‌ఎస్ నాయకులు సాబ్లే సంతోష్ సింగ్, షేక్ బాబాలు గురువారం పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరుతూ రహమత్‌నగర్ ఏరియాలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు.

విద్యార్థులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఎస్ఆర్ విద్యా సంస్థల్లో చదివి నీట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను ఆ సంస్థ నిర్వాహకులు సన్మానించారు. హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులకు గురువారం ఆ సంస్థ చైర్మన్ ఎనగందుల వర్దారెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు ఆ కళాశాల యాజమాన్యం తెలిపారు. జిల్లా నుంచి ఎంబీబీఎస్‌కు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు.